"ఏవండీ! టైం ఎనిమిదయింది! లేవండి..." అంది సుజాత.

"అబ్బ... కాసేపు పడుకోనీయవోయ్! ఎలా గూ ఆదివారమేగదా?" బద్ధకంగా అటు తిరిగి పడుకుంటూ అన్నాడు శంకర్.

"అవున్లెండి! మీకయితే ఆదివారాలు, రెండో శనివారాలు, పండగ సెలవులు..." మాకయితే అన్ని రోజులూ ఒకటే! అంది.

అంత 'జెలసీ' ఎందుకోయ్? అయినా మేం వారంలో ఆరు రోజులు కష్టపడి పనిచేస్తాం కాబట్టి ఆదివారం విశ్రాంతి తీసుకోవడానికి సెలవు ఇస్తారు. మరి మీరేమో మొగుడ్ని ఆఫీసుకు పంపి అమ్మలక్కలతో లోకాభి రామాయణం ముచ్చటించుకుంటారు... మాకు 'శాంతి' లేకుండా చేస్తారు.

"అబ్బో! అక్కడికేదో మీరు కష్టపడి పోతున్నట్లు, నేనేమో ఇంట్లో కూర్చుని



ఆడుకుంటున్నట్లు!" అంది మూతి సున్నాలా చుట్టి...

"అబ్బ! ఎంత ముద్దొస్తున్నావో!" అన్నాడు చెయ్యి పట్టి లాగుతూ...

వదలండి! మహానుభావా! పిల్లలు చూస్తారు.

"చూడకపోతే బాగానే వుంటుందన్న మాట!" అన్నాడు కన్నుగీటి.

"చాల్లెండి... రోజు రోజుకీ కుర్రాళ్లయిపోతున్నారు!"

"అదిసరే గానీ... రోజూ కాఫీ కప్పుతో నవ్వుతూ ప్రత్యక్షం అయ్యేదానివి..."

"అదా...! పంచదార నిండుకుంది" అందుకే తేలేదు.

హతవిధీ! ఫస్ట్ తారీఖు రావడానికి ఇంకా నాలుగు రోజులుంది. అంటే 96 గంటలు, 5,760 నిమిషాలు... అనగా...

"ఇక ఆపండి! లేచి మొఖం కడుక్కోండి!" అంది.

శంకర్ బాత్‌రూంకి వెళ్లి పేస్ట్ కనిపించక పోవటంతో "ఏయ్ సుజీ! పేస్ట్ ఎక్కడ పెట్టావు?" అన్నాడు.

"ఏమిటండీ! ప్రతిదీ చెప్పాలా! బాత్రూంలో పేస్ట్ కనిపించకపోతే దానర్థం అయిపోయిందని... ఈ నాలుగు రోజులూ ఉప్పుతో కడుక్కోండి" అంది.

ఛీ... ఛీ... ఏమిటో వెధవ జీవితం గొణుక్కున్నాడు.

ఎలాగో మొహం కడుక్కుని, స్నానం చేసి బయటకు వచ్చాడు.

# నవ్వు

"ఏవండీ! టిఫిన్ చల్లారిపోతుంది. అక్కడ పెట్టాను తినండి!" అంది.

టేబుల్‌మీదున్న ఉప్మా ప్లేట్ చూసి... "ఏమిటోయ్! రోజూలాగ ఇవాళ కూడా ఉప్మాయేనా! ఏదన్నా స్పెషల్ చేయొచ్చుగా!" అన్నాడు.

"ఇంకా నయం... ఆ ఉప్మా అన్నా చేశాను... స్పెషల్ కావాలట... స్పెషల్! సరుకులు తెచ్చేటప్పుడేమో పట్టీరాసి ఇస్తే... అదెందుకు? ఇదెందుకు? అని కొట్టి పారేస్తారు. స్పెషల్ చెయ్యాలంటే ఇంట్లో అన్నీ ఉండాలికదా! ఏదీ లేకుండా గాలిలోంచి తేవటానికి నా దగ్గర అద్భుత దీపం ఏమన్నావుందా?

బుద్ధితక్కువై అన్నాను... ఇక వదలవే!

బజారెళ్ళి కూరలు పట్టుకురండి. వంట చేయాలి...

కూరలు... వత్తి పలుకుతూ విరక్తిగా నవ్వుకున్నాడు.

ఏంటి డాడీ! నవ్వుతున్నావు? అన్నాడు ఆరేళ్ళ టింకూ అమాయకంగా మొహంపెట్టి...

ఏమీలేదుగానీ నువ్వెళ్ళి టి.వి.లో ప్రోగ్రామ్ చూడు... అన్నాడు.

ఏంటి చూసేది...? కరెంట్ వుంటేగా?

సి. హెచ్. వి. యస్. బ్రహ్మానందరావు

ఓ! అదొకటుంది కదూ! ఆదివారం పవర్ కట్. ఏమిటో... మధ్యతరగతి వాళ్లు అంటే ఎలక్ట్రిసిటీ వాళ్లకి కూడా లోకువే!

మీరింకా కదలలేదా? వంటింట్లోంచి బయటకు వస్తూ అంది సుజాత.

వెళుతున్నానే! అందరి పెళ్లాలూ... మొగుళ్ల కి సెలవు వస్తే ఎంచక్కా ఇంట్లో వుండమంటారు. నువ్వేమో వీధిలోకి నెడుతున్నావు...!

ఆ... అందరి మొగుళ్లలా నా మొగుడూ వుంటే నేను కూడా మిమ్మల్ని ఇంట్లోనే వుండమనేదానిని...

అంటే ఏంటి? నేను అందరిలా వుండటం లేదనా?

అది మీకే తెలియాలి!

అంటే నీ ఉద్దేశ్యం...?

నాది సదుద్దేశ్యమే మహానుభావా! అందమైన ఈ ఆదివారాన్ని మాటలతో ఎందుకు వేస్ట్ చేస్తారు...? మీరు తొందరగా కూరలు తెస్తే వంట చేసి, భోజనాలు పూర్తి చేసి, ఆ తర్వాత...

అంటూ ఫుల్‌స్టాప్ పెట్టేయటంతో...

చెప్పు... ఆ తరువాత ఏం చేద్దాం...

మొద్దు... అన్నీ నేనే చెప్పాలా!

నాకు తెలుసులే! నువ్వు చెబితే బాగుంటుందని అన్నాను. ఏం వుంది? హాయిగా నిద్రపోవచ్చు. అన్నాడు నవ్వుతూ...

అందుకే 'మొద్దు' అన్నాను.

అయితే నువ్వే చెప్పొచ్చుగా!

వచ్చాక చెబుతాలే!

చెబితేనే వెళతాను...

వెళ్లకపోతే మంచి ఛాన్స్ 'మిస్' అవుతారు. 'మిస్' అనే పదం వత్తి పలుకుతూ అంది.

ఈ 'మిస్' వుండగా మన డిక్షనరీలో 'మిస్' అయ్యేమాటే వుండదు అని కన్నుగీటి బయటకు బయల్దేరాడు.

'చిలిపి...' అనుకుంటూ లోపలికి వెళ్ళింది.

శంకర్ రోడ్డుమీద ఒక పక్కగా నడుస్తున్నాడు. నడుస్తూ ఆలోచిస్తున్నాడు. ఆలోచిస్తూ నడుస్తున్నాడు. ఏకకాలంతో రెండు పనులూ చెయ్యడం వలన అడుగులు భారంగా పడుతున్నాయి.

జేబులో వున్నవి రెండు పది కాగితాలు, రెండో మూడో రూపాయి బిళ్లలు. వాటిని నాలుగు రోజులు జాగ్రత్తగా కాపాడుకోవాలి.

అందుకే దూరమైనా మార్కెట్‌కి నడిచి వెళుతున్నాడు. రిక్షా ఎక్కితే ఓ ఐదారు రూపాయలు ఖర్చు...


మాస్టారూ! కాస్త చూసి నడవండి... లేకపోతే ప్రాణానికి ప్రమాదం అంటూ శంకర్‌ని చూసి, ఆనందంగా...

ఒరేయ్ శంకూ! నేనురా... ప్రసాదుని. రేపల్లె జూనియర్ కాలేజీలో ఇంటర్ చదివాం. తర్వాత ఏవో రెండు మూడు లెటర్స్ వ్రాసావను కుంటాను. తర్వాత అవీ ఆగిపోయాయి. ఇంతకీ ఏం చేస్తున్నావు? ఎక్కడుంటున్నావు? పెళ్లి చేసుకున్నావా? పిల్లలెంతమంది? అని అడుగుతూంటే...

ఒరేయ్ ప్రసాద్! నువ్వేం మారలేదురా! పది సంవత్సరాల కాలం గడిచినా అప్పటికీ. ఇప్పటికీ నీ వాగుడు పోలేదు.

ఇంతకీ విషయాలు చెప్పావుకాదు.

ఏంవుంటాయి? నా గురించి చెప్పుకో దగ్గ




వంటూ ఏమీ లేవు! డిగ్రీ అయ్యాక ప్రభుత్వ ఆఫీసులో గుమస్తా ఉద్యోగం... వెంటనే పెళ్లి. తర్వాత ఇద్దరు పిల్లలు. ఇదీ నా కథ. నువ్వు ఏం చేస్తున్నావు? ఎక్కడుంటున్నావు?

నాగురించి చెప్పుకోవాల్సింది కూడా ఏం లేదు. కాకపోతే నువ్వు ఉద్యోగం చేస్తున్నావు, నేను ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాను. అందుకే పెళ్లికూడా చేసుకోలేదు. ఎందుకంటే నాకే తింటానికి లేదు. పెళ్లి చేసుకుని భార్యను ఎలా పోషించగలను? ఆమెను పస్తులుంచే అధికారం నాకెక్కడిదని... అన్నాడు బాధగా...

సారీరా! నా జీవితమే అనుకుంటే నా కంటే కూడా నువ్వు పడే బాధలు ఎక్కువని తెలిసి ఇంకా బాధపడుతున్నాను.

అందుకే నా బాధలు ఎవరికీ చెప్పను. ఇన్ని సంవత్సరాల తర్వాత కనిపించావని... అదీకాక బాధని ఎదుటి వారికి చెప్పుకుంటే కాస్త ఉపశమనంగా వుంటుందని చెప్పాను.

మార్కెట్‌కి వెళ్లి, కూరలు తీసుకొని ఇంటికి వెళదాం అన్నాడు.

వద్దురా! నాకు వేరే పని వుంది. ఏదో ప్రైవేట్ కంపెనీలో క్లర్క్ పోస్ట్‌కి ఇంటర్వ్యూ వచ్చింది... వెళుతున్నాను అన్నాడు.

ఆదివారం ఇంటర్వ్యూ ఏమిట్రా! అన్నాడు

ప్రైవేట్ ఉద్యోగం కదా! అందువలన మనకి పరీక్ష పెట్టి వుంటారు. ఇన్ని సంవత్సరాల తరువాత కలిసాం... పద హోటల్లో 'టీ' తాగి వెళదాం అన్నాడు.

ఆ మాట వినేటప్పటికి శంకర్‌కి కాళ్లకింద భూమి కంపించినట్లయింది. కానీ మొహమాటం అడ్డొచ్చి, పద... అన్నాడు.

ఇద్దరు హోటల్‌కి వెళ్ళారు. ఎదురెదురు కుర్చీలలో కూర్చొని మాట్లాడుకుంటూండగా... సర్వర్ వచ్చాడు... ఏం కావాలి సార్! అంటూ.

శంకర్ 'టీ' అని చెప్పబోతూండగా ప్రసాద్

సర్వర్‌తో రెండు మినపట్లు పట్టుకురా! అన్నా డు.

సర్వర్ వెళ్లాక శంకర్‌తో...

శంకూ! కాలేజి రోజులు ఎంత హాయిగా వుండేవిరా! బాధ్యతలు, బాధలూ లేకుండా 'జాలీగా' గడిపేసాం. ఇప్పుడు రూపాయి కావా లన్నా అమ్మని, నాన్నని అడుక్కోవటమే!

అప్పుడూ అంతేగదరా...!

అవుననుకో! కానీ అప్పుడు చదివించడం వారి బాధ్యత... ఇప్పుడు వాళ్లని సుఖపెట్టాల్సిన సమయంలో కూడా వాళ్లమీద ఆధారపడి బ్రత కడం ఎంత నరకమో సంపాయించుకునే నీకు తెలీదురా... అన్నాడు. సర్వర్ మినపట్లు తెచ్చి ఇంకా ఏమన్నా కావాలా సార్? అన్నాడు.

తిన్న తర్వాత చెబుతాంలే వెళ్ళు! అన్నాడు.

జేబులో వున్న రెండు పది నోట్లకి కాళ్లొచ్చా యనుకుంటే... ఇంకా ఏమన్నా చెబితే పరువు కూడా పోతుందని ఆలోచిస్తున్న శంకర్‌కి టిఫిన్ మింగుడుపడడంలేదు.

ప్రసాద్ దోసె తిని, సర్వర్‌ని పిలిచాడు.

సర్వర్ వినయంగా "ఏం కావాలి సార్" అన్నాడు.

వన్ బైటు కాఫీ పట్టుకురా! అన్నాడు.

హమ్మయ్య! బ్రతికించాడు అనుకున్నాడు శంకర్.

సర్వర్ కాఫీతో బాటు బిల్ తెచ్చి టేబుల్‌పై పెట్టాడు.

బిల్లు 19 రూపాయలు అయింది.

కాఫీ తాగి బిల్లు తీసుకుని క్యాష్ కౌంటర్‌లో బిల్లు 'పే' చేసి బయటకొచ్చారు.

"చాలా థాంక్స్‌రా శంకూ! మంచి టిఫిన్ పెట్టించావు" అన్నాడు.

"దాందేముందిలేరా! చాలా సంవత్సరాలకి కలిసాం. మళ్లీ ఎప్పుడు కలుస్తామో! ఈ కల యిక మధుర జ్ఞాపకంగా మిగిలిపోతుంది! అన్నాడు ఏడ్వలేక నవ్వుతూ.

ఓకె! వస్తారా! ఇంటర్వ్యూ టైం అవుతోంది! అని హడావిడిగా వెళ్లిపోయాడు. నీరసంగా అడుగులు వేస్తూ... దారిలో రెండు రూపా యలు పెట్టి పచ్చిమిరపకాయలు కొని ఇంటికి వచ్చాడు.

"ఏమిటండీ! పొద్దుననగా వెళ్లి ఇప్పుడా రావడం? మార్కెట్ మొత్తం కొనేశారా! ఏమి టి?" అంది సుజాత నవ్వుతూ...

నవ్వలేక నవ్వుతూ సంచి చేతికందించాడు.

ఏమిటండీ! మార్కెట్‌లో పచ్చిమిరప కాయ లు తప్ప ఏమీ లేవా? లేకపోతే ఊర్లో ఏమన్నా బంద్ జరుగుతోందా? అంది ఆశ్చర్యంగా.

లేదోయ్! అసలేం జరిగిందంటే... అంటూ మొత్తం విషయమంతా వివరంగా చెప్పాడు.

ఎవరండీ బాబూ! ఈ అనుకోని అతిథి గారు... మొత్తానికి ఈ అతిథి దేవుడ్ని తలచు కుంటూ ఈ నాలుగు రోజులు పచ్చిమిరప కాయల కారంతో గడిపేయవలసిందే... అంది నవ్వుతూ...

నాన్నా! అమ్మ ఎందుకు నవ్వుతోంది? అన్నాడు టింకూ అప్పుడే ఆడుకుని వచ్చి...

అదా! అంతా అనుకోనిఅతిథి మహిమలే... అన్నాడు మనస్ఫూర్తిగా నవ్వుతూ...

టింకూకి ఏం అర్థం అయిందోగానీ వాడూ నవ్వేశాడు పకపకా. ●